ప్రజాశక్తి

సోమవారం 21 నవంబర్ 2022 | 5 | పార్వతీపురం మన్యం

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత ఉపాధి శిక్షణ

కలెక్టరేట్ : ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కళాశాలలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి సాయి కుమార్ తెలిపారు. విశాఖ స్కిల్ కాలేజీలో మెకట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టం ఇంటిగ్రేటర్, ప్రొడక్షన్ డిజైనర్ ఇంజనీరింగ్ మెకానికల్ ఆటోమేటిక్ రోబోటిక్ ఇంజనీర్, వంటి కోర్సుల్లో చేరుటకు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అనకాపల్లి స్కిల్ కాలేజీలో సిఎన్‌సి టెక్నాలజీ, ప్రొడక్షన్ డిజైన్, మెకట్రానిక్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిప్లొమా, ఇంజనీరింగ్ ఆఖరి సెమిస్టర్ చదువుతున్న వారు కూడా అర్హులని అన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజనం సదుపాయం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలు కోసం 6305110947, 6303493720 నంబర్లను సంప్రదించాలన్నారు.

మక్కువ రోడ్డుకు మోక్షమెప్పుడో?

నత్తనడకన పనులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

గతుకులమయమైన మక్కువ- సాలూరురోడ్డు

ప్రజాశక్తి - సాలూరు

సాలూరు పట్టణం నుంచి మక్కువ రహదారి నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్లో నెలకొంది. ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాది కావస్తున్నా ఇంకా బాలారిష్టాల మధ్య నిర్మాణం కొట్టుమిట్టాడుతోంది. గడచిన అనేక ఏళ్లుగా ఈ రోడ్డు నిర్మాణానికి నోచుకోని కారణంగా మొత్తం రహదారి ఛిద్రమైంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డు నిర్మాణానికి రూ.56కోట్లు మంజూరయ్యాయి. ఏడాది క్రితంఈ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి మధ్యలో ఉన్న వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు జరిగాయి. ఈ రహదారి డబుల్ రోడ్డుగా విస్తరిస్తుండడంతో దీనికి ఇరువైపులా ఉన్న చెట్లు, తుప్పలు, డొంకలు తొలగింపు జరిగిపోయింది. అయితే పనులు నిలిచిపోయాయి.సాలూరు నుంచి మక్కువ మధ్య వాహనాల రాకపోకలు పెరగడంతో ఇప్పుడు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ముఖ్యమైన రహదారి నిర్మాణానికి కాంట్రాక్టరు జాప్యం చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి రోజూ వందల సంఖ్యలో భారీ, చిన్న వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల రాకపోకలు ఈ రహదారి మీదుగా సాగుతున్నాయి. కాంట్రాక్టరు జాప్యం కారణంగానే పనులు నత్తనడకన సాగుతున్నాయనే వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు అధ్వాన్నంగా ఉన్న రహదారి మరింత ఛిద్రమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము, ధూళి రేగడంతో ప్రయాణికులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

బిల్లు మంజూరు లో జాప్యం కారణమా?

ఇంత వరకు జరిగిన రహదారి పనులకు బిల్లు మంజూరులో జాప్యం కారణంగానే కాంట్రాక్టరు నిర్మాణ పనులు నత్తనడకన చేపడుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలకు సంబంధించి చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ లకు సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చేసిన పనికి బిల్లు మంజూరైతే తర్వాత పని చేయాలని కాంట్రాక్టరు భావిస్తున్నారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడంలో విఫలమవుతున్న కారణంగా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ రహదారి నిర్మాణం విషయంలో కాంట్రాక్టరు జాప్యం చేస్తుండడం వెనుక బిల్లు మంజూరులో జాప్యమే అసల కారణమని తెలుస్తోంది. ఒక వేళ అప్పు చేసి మొత్తం పని పూర్తి చేసినా బిల్లులు త్వరగా మంజూరవుతాయనే నమ్మకం కాంట్రాక్టర్లకు కలగడంలేదు. ఇలాంటి పరిస్థితిలో నియోజకవర్గ పరిధిలో చాలా అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోతే ముందుకెళ్లేది లేదని కాంట్రాక్టర్లు భీష్మించుకుని ఉన్నారు. అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచుతున్నా వారు పట్టించుకునే స్థితిలో లేరు.

డిప్యూటీ సిఎం పై ఒత్తిడి

మక్కువ రహదారి నిర్మాణ పనులు జాప్యమవుతుండడంపై డిప్యూటీ సిఎం రాజన్నదొర తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సాలూరు నుంచి మక్కువ మధ్య గ్రామాలకు చెందిన అధికార పార్టీ సర్పంచ్‌లు, నాయకులు రాజన్నదొరపై రహదారి దుస్థితి గురించి తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో జాప్యంపై ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నారని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హితబోధ చేస్తున్నారు. కాంట్రాక్టరుకు పనులు వేగవంతం చేయాలని చెప్పలేక, ప్రజాప్రతినిధుల ఒత్తిడి తట్టుకోలేక అధికారులు నలిగిపోతున్నారు. తాజా పరిస్థితుల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర ముఖ్యమైన రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యంపై సిఎం జగన్ మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నేడో రేపో సిఎం జగన్‌తో జరుగనున్న జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల మందగమనం గురించి చెపుతారనే వాదనలు వినిపిస్తున్నాయి.

వణికిస్తున్న చలి... తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో చలి వణికిస్తోంది. గత ఐదు రోజులు నుంచి పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. సాయంత్రం 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు పొగ మంచు ఎక్కువగా కురవడంతో చలి వణికిస్తోంది. కేదారిపురం, తాడికొండ, దుమ్మంగి, కొండవాడ, పి.ఆమిటి మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు చలి మంటలు, ఉన్ని దుస్తులు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. శని, ఆదివారాల్లో మబ్బులతో పాటు ఈదురు గాలుల ప్రభావంతో చలి మరింత పెరిగింది. మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, ఒడిశా ప్రాంతాలకు వెళ్లే వాహన రాకపోకలకు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంచు ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోడ్డును కప్పేసిన మంచుదుప్పటి

మహాసభనుద్దేశించి మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి, హాజరైన అంగన్‌వాడీలు

సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దాం

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి
విజయవంతంగా ముగిసిన జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదామని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హిమప్రభ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే రీతిలో వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో కోతలు విధిస్తూ, మరో పక్క నూతన విద్యావిధానమంటూ అంగన్వాడీ కేంద్రాలకు మంగళం పాడేందుకు కుట్ర కేంద్రం కుట్రపన్నుతుందన్నారు. ఈ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అతి వేగంగా అమలుచేయడం విడ్డూరంగా ఉన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అదేవేగం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణాలో వేతనాలు పెంచి పిఆర్‌సి అమలవుతున్నా, మన రాష్ట్రంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని విమర్శించారు. పైగా ప్రభుత్వమే సమస్యలు సృష్టించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. శాశ్వత ప్రాతిపదికన సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయకుండా ఇన్‌ఛార్జిల పేరుతో భర్తీ చేస్తుండడం అంగన్వాడీల మధ్య చీలిక తేవడమే అవుతుందన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, పెన్షన్‌తో కూడిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, బకాయి మెనూ ఛార్జీలు, టిఎ, గ్యాస్ బిల్లులు, సిబి ఈవెంట్ బిల్లులు చెల్లించాలని, అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించాలని, మినీ సెంటర్లను జనాభాకు అనుగుణంగా మెయిన్‌సెంటర్లుగా మార్పు చేయాలని, వేధింపులు, తొలగింపులు ఆపాలని, ఎన్‌ఇపిని రద్దు చేయాలని, రిజర్వేషన్లు అమలుచేసి శాశ్వత ప్రాతిపదికన సూపర్‌వైజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి, సహాయ కార్యదర్శి వి.రామలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.ఇందిరా, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటరమణ, వై.మన్మథరావు, నాయకులు రెడ్డి వేణు, కొల్లి గంగు నాయుడు పెద్ద ఎత్తున అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహాసభ సందర్భంగా కురుపాంలో భారీ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

సరళకుమారి (అధ్యక్షులు

జ్యోతిలక్ష్మి (కార్యదర్శి)

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సరళకుమారి, జ్యోతిలక్ష్మి

మహాసభ అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూనియన్ జిల్లా అధ్యక్షులుగా బి.సరళకుమారి, కార్యదర్శిగా జి.జ్యోతి లక్ష్మి, కోశాధికారిగా అమరవేణి, గౌరవ అధ్యక్షులుగా ఎం. ఉమామహేశ్వరితో పాటు 11 ప్రాజెక్టుల నుంచి 35 మంది జిల్లా కమిటీ సభ్యులు, ఆఫీసు బేరర్లు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అంగన్వాడీల హక్కులు సాధనకు నిరంతరం పాటు పడతామని అన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే కార్మికవర్గ సమస్యలు పరిష్కారం

- కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోన్న మోడీ ప్రభుత్వం
- సిఐటియు బహిరంగ సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/శంగవరపుకోట

ఐక్య ఉద్యమాలతోనే కార్మికవర్గ సమస్యలు పరిష్కారమౌతాయని వక్తలు పేర్కొన్నారు. దేశంలో మోడీ సర్కారు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుంటే, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తందానతాన అంటోందని విమర్శించారు. సిఐటియు పదో జిల్లా మహాసభ ఎస్.కోటలో ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. దీనికి ముందు ఎస్.కోట మెయిన్ రోడ్డులో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ సర్కిల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో

ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గంపై దాడి చేస్తోందని విమర్శించారు. ఇటువంటి విధానాల వల్ల కార్మికులకు మెరుగైన వేతన విధానం అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ధరల నియంత్రణ మాటే లేకపోవడం వల్ల మోడీ హయాంలో గ్యాస్ ధర రూ.400 నుంచి రూ.1200కి, పెట్రోల్ ధర రూ.60 నుంచి రూ.120కి పెరిగాయన్నారు. ఇలా అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని వివరించారు. ఇటువంటి పర్యావసానాల వల్లే మరోవైపు కొన్ని పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. నష్టాల పేరిట విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విదేశీ బహుళజాతి కట్టబెట్టేందుకు సిద్ధపడినప్పటికీ సిఎం జగన్ గానీ, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ గానీ ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలపై చెత్త భారం మోపిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని ఏప్రిల్ 5న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సుబ్బరావమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పాలకుల విధానాల వల్ల కార్మికులు, పేదలు మరింతగా అణచివేతకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ ప్రభుత్వం సచివాలయానికి ఒక ఆశా కార్యకర్త అంటూ వారిని తగ్గించేందు కుట్ర పన్నుతోందన్నారు.

తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల జిల్లాలోని కొత్తవలస, బొబ్బిలి, విటి అగ్రహారం, సారిపల్లి పారిశ్రామిక వాడలు కళావిహీనంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెర్రో, జ్యూట్, చక్కెర పరిశ్రమలు మూతపడడం వల్ల సమారు 20 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని వివరించారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేయకుండా రైతాంగాన్ని కూడా విస్మరించిందన్నారు. పార్టీల జెండాలు మారినా వారి అజెండా మాత్రం ఒక్కటిగానే ఉందన్నారు. బొబ్బిలిలో ఉపాధి భద్రత కోసం పోరాడిన 40 మంది మహిళా కార్మికులను వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేసి జైలుకు పంపిందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, ఉపాధ్యక్షులు అంబళ్ల గౌరినాయుడు, అనసూయ, శంకరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రతినిధుల సభలో సిఐటియు ఆఫీస్ బేరర్లు యుఎస్ రవికుమార్, రమణ, కాంతారావు, జగన్మోహన్ పాల్గొన్నారు.

బహిరంగసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు



సీతంపేట పురవీధుల్లో ర్యాలీ లో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, పిఒ నవ్య, అధికారులు

సీతంపేటలో స్వచ్ఛత ప్రచారదినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం సీతంపేటలోని పిఎంఆర్‌సి వద్ద స్వచ్ఛత క్యాంపెయిన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఐటిడిఎ పిఒ బి.నవ్య హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పిఎంఆర్‌సి భవనం వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సంధర్భంగా స్వచ్ఛత క్యాంపైన్ డే గూర్చి మాట్లాడుతూ ప్రజలకు మొక్కల ప్రాముఖ్యత, అవగాహన కల్పించారు. అలాగే "జన జాతీయ గౌరవ దినోత్సవం గిరిజనుల గర్వదినం" ప్రాముఖ్యతను ప్రజల ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పిఎంఆర్‌సి భవనం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీతంపేట ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి ప్రజలకు స్వచ్ఛత ప్రాధాన్యతను వివరించారు. ఎంపిపి ఆదినారాయణ, సీతంపేట సర్పంచ్, ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి, ఇఇ మురళి, డిడి నగేష్, ఎంపిడిఒ గీతాంజలి, ఎపిడి నారాయణరావు, దేశ్, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్న సిబ్బంది

ఆహ్లాదకరంగా సన్యాసిరాజు మున్సిపల్ పార్క్

హర్షంవ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం చర్చి వీధిలో ఉన్న డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్క్‌ను ఆహ్లాదకరంగా మార్చేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జె.రామఅప్పలనాయుడు పార్కును పరిశీలించి ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రత్యేక చొరవ చూపడంతో పట్టణంలో ఉన్న పర్యావరణ ప్రేమికులు, వాకర్స్ సభ్యులు, చిన్నారులు తల్లిదండ్రులు, వయోవృద్ధులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో ఎన్నో ఏళ్ల నుంచి మరమ్మతుకు గురైన క్రీడా పరికరాలకు మరమ్మతులు చేయడమే కాకుండా, సబ్ కలెక్టర్ బంగ్లాలో ఉన్న మరికొన్ని క్రీడా పరికరాలను పార్కు లోపల అమర్చారు. అంతేకాక పార్కు లోపల గల ప్రహరీ గోడకు వెల్లవేయించి సుందరీకరణ పనులు చేపడుతున్నారు. దీంతో పార్క్‌కు వచ్చిన పర్యాటక ప్రేమికులు పార్క్ సుందరీకరణపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పార్క్‌తో పాటు పట్టణంలో పాత బస్టాండ్ దగ్గరలో ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న పార్కు, ఆర్టీసీ డిపో వెనుక ఉన్న పార్క్‌లను కూడా అభివృద్ధి చేసి పర్యాటక ప్రేమికు లకు అందుబాటులోకి తీసుకువస్తే మంచిదని స్థానికులు కోరుతున్నారు.

తోటలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ పంచాయతీ తోట గిరిజన గ్రామంలో రఫా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్విన్‌పేట మధు హెల్త్ కేర్ వైద్యులు రవికుమార్ 40మంది రోగులకు వైద్య సేవలందించారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

ఎస్‌సిల సాధికారతకు కృషి

- సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలకు కృషి
- లబ్ధిదారులకు పక్కాగా పథకాలు అందజేత
- ప్రజాశక్తితో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ ముఖాముఖి

జిల్లాలో ఎస్‌సిలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా వారికి అందజేసి వారి సాధికారతకు కృషి చేస్తున్నట్టు సాంఘికసంక్షేమ సాధికారతాధికారి మహమ్మద్ గయాజుద్దీన్ అన్నారు. అలాగే జిల్లాలో గల అన్ని సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో దళితుల సంక్షేమానికి, వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

-ప్రజాశక్తి , కలెక్టరేట్,



జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి?

జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9ప్రీమెట్రిక్, ఆరు పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో పార్వతీపురం డివిజన్లో 8, పాలకొండ డివిజన్లో 7హాస్టళ్లు ఉన్నాయి. ప్రీ మెట్రిక్ హాస్టల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి లోపు ఏదైనా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ నుండి ఆ పైబడిన కోర్సులు చదువుతున్న విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం.

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు?

జిల్లాల 15 వసతి గృహాల్లో 1800 సీట్లుకు గానూ 752 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 9 ప్రీ మెట్రిక్ హాస్టల్ ఉండగా 1200 సీట్లు ఉన్నాయి. వీటిలో 457 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో ఉన్న ఆరు పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో మొత్తానికి 600 సీట్లు మంజూరు చేయగా వీటిలో 295 మంది మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 111 మంది బాలురు ఉండగా 184 మంది బాలికలు ఉన్నారు. 2021- 22లో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 86 మంది విద్యార్థులు హాజరు కాగా 77 మంది (90 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఎంతమంది విద్యార్థులు లబ్ధి పొందారు?

జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 2021- 22వ విద్యా సంవత్సరం గాను 2278 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.487.30 లక్షలు మంజూరయ్యాయి. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 2021-22 సంవత్సరానికి గానూ ఇంతవరకు 2381మంది విద్యార్థులకు రూ.234.65 లక్షలు మంజూరయ్యాయి.

సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఏఏ పెన్షన్ ఎంతమందికి అందజేస్తున్నారు?

సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్‌పిలకు డప్పు కళాకారులకు ప్రతినెలా రూ.3వేలు చొప్పున పెన్షన్ మంజూరవుతుంది. అర్హులైన 50 ఏళ్లు కంటే ఎక్కువ వయసు గల తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు అర్హులు. ఈ పథకం ద్వారా ఇప్పటికే జిల్లాలో 1592 మంది డప్పు కళాకారులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున సెర్ప్ ద్వారా పెన్షన్ మంజూరవుతున్నాయి. 221 మంది డప్పు కళాకారులకు కొత్తగా పెన్షన్ మంజూరు చేసే నిమిత్తం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. అలాగే చర్మకారులకు నెలకు రూ.2500 చొప్పున పెన్షన్ మంజూరవుతున్నాయి. 40ఏళ్ల కంటే ఎక్కువ వయసు గల తెల్ల రేషన్ కార్డు కలిగిన ఎస్‌పిలు ఈ పథకానికి అర్హులు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 1405 మంది చర్మకారులకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ప్రతినెలా పింఛను అందజేస్తున్నాం. 339 మంది చర్మకారులకు కొత్తగా పెన్షన్ మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపడమైనది.

పథకాల అవగాహన అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సాంఘిక సంక్షేమ శాఖ అందజేస్తున్న పథకాలపై అవగాహన, వాటి అమలుకు ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో సంక్షేమ, విద్యా సహాయకులుగా నిరుద్యోగ యువతను నియమించాం. జిల్లాలో 350 సచివాలయాలకు గానూ ఈ శాఖ ద్వారా 226 మందిని నియమించింది. వీరిలో 205 మంది పనిచేస్తున్నారు. సంక్షేమ, విద్య సహాయకులు సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ, ఇతర సంక్షేమ శాఖలచే బలహీన వర్గాల వారికి అమలు చేయబడే కార్యక్రమాల గురించి వారి పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంక్షేమ శాఖల ద్వారా అమలు చేయబడిన పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుంది.

సాంఘిక సంక్షేమం ద్వారా పేదలకు అందజేస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి?

ప్రభుత్వం జగజీవన్ జ్యోతి (ఉచిత విద్యుత్) పథకం ద్వారా షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగం పూర్తి ఉచితంగా అందజేస్తుంది. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించిన షెడ్యూల్ కులాల వారు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి వివాహ సమయంలో రూ.40 వేల ఆర్థిక సహాయం అందిస్తుంది, షెడ్యూల్ కులాల వారు అంతర్ కుల వివాహం చేసుకుంటే రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

పోలీస్ స్టేషన్‌ను సందర్శన

సీతంపేట : స్థానిక పోలీసు స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆదివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు క్రైమ్ రేట్, స్టేషన్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై ఎ.నీలకంఠరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సిబ్బంది అన్ని వేళలో అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డిఎస్పి జీవీ కృష్ణారావు సూచించారు. ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ ను ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా రావడంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. రికార్డులు నిర్వహణ, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట సబ్ ఇన్స్పెక్టర్ షణ్ముఖరావు ఉన్నారు.

టౌన్ సిఐగా శ్రీనివాసరావు

సాలూరు: పట్టణ సిఐగా సి.హెచ్.శ్రీనివాసరావును నియమిస్తూ డిఐజి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి సిఐగా పనిచేసిన శ్రీనివాసరావు రెగ్యులర్ సిఐగా నియామక మయ్యారు. సిసిఎస్ సిఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గత రెండు నెలలుగా ఇంఛార్జి సిఐ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన సిఐ సుధాకర్‌ను టౌన్ స్టేషన్‌పై గదిలో నిల్వ చేసిన దీపావళి మందుగుండు పేలుడుకి బాధ్యుడ్ని చేస్తూ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

రుతు పరిశుభ్రతపై అవగాహన

భామిని : బాలికలు, మహిళల జీవితంలో రుతుక్రమం ఆరోగ్యకరమైన భాగమని హెూలీ క్రాస్ సంస్థ కార్యకర్త శ్రీవిద్య అన్నారు. సమాజంలో దీనిపైన 'శాపం', 'అశుద్ధం', 'మురికి' అని అపోహలు ఉన్నాయి, వాటినుంచి బయటపడాలని అన్నారు. మండలంలోని సింగిడిలో హెూలీ క్రాస్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణా కేంద్రంలో బాలికలకు, మహిళలకు రుతు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణా కేంద్రం శిక్షకులు వై.మీనా పాల్గొన్నారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా మహిళల వస్త్రాలతో పాటు పునఃర్వనియోగ గుడ్డ ప్యాడ్‌లు కుట్టడం పైన శిక్షణ ఇస్తున్నామని తెలియచేశారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్‌ఐ శంకరరావు

చట్టాలపై అవగాహన ఉండాలి

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని ఎల్విన్‌పేట ఎఎస్ఐ శంకరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని కొండవీధిలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వం దిశ, నిర్భయ, చట్టాలను కఠినంగా అమలు చేస్తుందన్నారు. తమ మొబైల్ ఫోన్లో దిశ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆపద సమయంలో రక్షణ కవచంలా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలు వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్రావు, మహిళా పోలీస్ లక్ష్మి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మన ఊరు - మన కళాశాల అ'పూర్వ' కలయిక

పాలకొండ రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన "మన ఊరు - మన కళాశాల అపూర్వ కలయిక" కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితులంతా ఒకే వేదికపై కలుసుకోవడం, ఆత్మీయంగా పలకరించుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులంతా ఒక ఆత్మీయ కలయికగా కలిసి మన ఊరు, మన కళాశాల అభివృద్ధి గురించి చర్చించి తమ వంతు పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి సరదాగా ముచ్చటించుకున్నారు.

బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం అందులో కార్తీక మాసం చివర ఆదివారం కావడంతో పర్యాటకులతో పార్కు కిక్కిరిసింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల పర్యాటకులు కూడా తరలివచ్చారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. అడ్వెంచర్ వెహికల్‌తో పార్కు చుట్టూ తిరిగారు. ఆనందవిహార్ వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకుల వాహనాలు బారులు తీరాయి.

'ఇదేం కర్మ'ను విజయవంతం చేస్తాం



గుమ్మలక్ష్మీపురం : ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని కురుపాం నియోజక వర్గ నాయకులు ఎన్.కృష్ణబాబు తెలిపారు. ఆదివారం మండలంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియ చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంచి సామాన్య ప్రజలకు మోయలేని భారంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రిటైర్ అయిన వారికి రావాల్సిన బెనిఫిట్లు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రతి ఒక కార్యకర్త సైనికులుగా ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవ ముగింపు వేడుకలు ఇంచార్జ్ శాఖ గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 5వవార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు మాట్లాడుతూ పుస్తక పఠనం మనసుకు వ్యాయామం లాంటిదని, పరిజ్ఞానం పెంపొందించుకొని పది మందికి స్ఫూర్తి ప్రదాతలు అవుతారని అన్నారు. పుస్తకాలు చదువుకొని భవిష్యత్తులో మంచి ప్రయోజకులవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్య, ఎపిజిఇఎ పార్వతీపురం మన్యం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతలపాటి భరత్ భూషణ్, కౌన్సిలర్లు కడగల వెంకటరమణ, కిల్లారి మోహనరావు, బాసూరు కాంతారావు, ప్రధానోపాధ్యాయులు జామి రవి, లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర, సబ్బ నానాజీ, యోగా గురువు కె.జనార్ధనరావు పాల్గొని గ్రంథాలయ ఆవశ్యకతను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా పోటీలు విజేతలకు వ్యాసరచన జూనియర్స్ విభాగంలో పి.సుస్మిత, బి.రూప, బి.సింధూజ, సీనియర్స్ విభాగంలో పి.హర్షిత, జి.గాయత్రి, కె.యోగీశ్వరి, ముగ్గుల పోటీలో ఎస్.ప్రసన్న గౌరీ, ఎల్.చందన, బి.స్వాతికి ముఖ్య అతిథులు ద్వారా బహుమతులు అందజేశారు.

భామిని : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం లైబ్రెయిన్ కె.సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్‌ఎంపిపి బోనగడ్డి ధర్మారావు వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎంపిటిసి బిడ్డికి విష్ణు, బాలయోగి గురుకులం ప్రిన్సిపల్ విజయ నిర్మల, గేదెల మోహన్, ఉపాధ్యాయులు సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జె,తేరేజమ్మ, గరికయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు జ్ఞానాన్ని పెంచేవన్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు అనేక పుస్తకాలు లభిస్తాయని వాటి ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పోటీలు నిర్వహించే బహుమతులను అందజేశారు. 60 మంది విద్యార్థుల వరకూ ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్, ఇఒ జివి రమణ, వార్డు సభ్యులు బి.రామారావు, పి.రామారావు, ఉపాధ్యాయులు డి.రామారావు, కె.పైడ్రాజు, సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి బివి రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిటిసి సభ్యులు దండి ఏడు కొండలు, కృష్ణాజీ, ఉదయ కుమార్, కొత్త వలస జెడ్‌పి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సి హెచ్.వెంకట రమణ పాల్గొన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సీతానగరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

సీతంపేట : స్థానిక కశాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక తహశీల్దార్ ఎస్.నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తక పఠనం జీవితానికి నాణ్యతను జోడిస్తుంది. బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గతంలో సీతంపేట గ్రంథాలయంలో పనిచేసి రిటైర్ అయిన శ్రీరాములును సన్మానించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు హేమసుందర్ ఎ.గౌరీష్, హరినాథ్, తులసమ్మ, జ్యోత్స్న, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకష్ణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మురళి, మనోహర్, సూర్య ప్రకాష్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్, వార్తాపత్రికలు ,నవలలు, కథల పుస్తకాలు చదవాలన్నారు. క్రమశిక్షణ ఉండి బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు వెళ్లవచ్చు అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం నిర్వహకులు డొనక సుకన్య, సచివాలయం సిబ్బంది ఉపాధ్యాయులు ఉన్నారు.

వీరఘట్టం : స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



గణేష్‌బాబును సత్కరిస్తున్న శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువర్ణ

ఉత్తమ గ్రంథాలయ అధికారిగా గణేష్‌బాబు

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న బబ్బురు గణేష్‌బాబుకు ఉత్తమ గ్రంథాలయాధికారిగా శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువారి సువర్ణ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఉచిత విద్యుత్తు కోసం గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజనులకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బిల్లులు ఇచ్చి కట్టమని వేధింపులు చెల్లించమనడం సరైంది కాదని పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్వాసిత గిరిజనులు బద్నాన అభిమన్యుడు, పాడి సింహాచలం, గొలుగు సన్యాసిరావు, పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కోడికాళ్ళ వలస వద్ద నిర్వాసిత గిరిజనులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలైన గిరిజనులకు ఎంతవరకు గత ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వం తమ వద్ద బిల్లులు వసూలు చేసేందుకు అధికారులు వేధింపు చేస్తున్నారని అన్నారు. తమకు పెద్దగెడ్డ రిజర్వాయర్లు సర్వం కోల్పోయి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా మమ్మల్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పేద గిరిజనుల కోసం తాము అండగా ఉన్నామని చెప్తున్న ప్రభుత్వం దళితులకు, గిరిజనులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వడంలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం పేదలైన గిరిజన, దళితులకు ఉచిత కరెంటు ఇచ్చి ఆదుకోవాలని, లేకుంటే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి గ్రామ సచివాలయ పరిధిలో గల సోమగండి పంచాయతీలో సోమగండికాలనీ, మెట్టుగూడ, చిన్న మెట్టుగూడ, కంబగుడ, చీడిగూడ, కొత్తగూడ గ్రామాల్లో ఆదివారం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో గడప గడపకు - మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మెట్టుగూడలో గడప గడపకు పర్యటిస్తున్న ఎమ్మెల్యే సవర చిన్నమంగయ్య కుమారుడు సవర ప్రవీణ్ లిబోన్ ఇన్ఫెక్షన్‌లితో బాధపడుతున్నందున ప్రభుత్వ పరంగా వైద్య సేవలు అందించేందుకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు ఉన్న సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో

మెట్టుగూడలో గిరిజనులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్నఎమ్మెల్యే కళావతి

ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, రాము, ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్ ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, ఎపిఒ సాగర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బురుజోలలో

భామిని: మండలంలోని బురుజోల పంచాయతీ పరిధిలో ఎంఎల్‌ఎ వి.కళావతి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తారని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం తెలిపారు. ఈ కార్యక్రమాలో స్థానిక సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

ఘనంగా కృతజ్ఞతర్పణల పండగ

కురుపాం : స్థానిక గుడ్ సమారిటన్ లూథరన్ దేవాలయంలో పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కృతజ్ఞతర్పణల పండగ క్రైస్తవులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు విశ్వాసుల ఎడల చేసిన మేలులకు గుర్తుగా కానుకలు అర్పించడమే కృతజ్ఞతర్పణల పండగని తమ ప్రథమ ఫలాలను మొట్ట మొదటిగా దేవుని సన్నిధికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో ఆరాధించిన క్రైస్తవులు ప్రతి క్రైస్తవుడు యేసుక్రీస్తుతో సహవాసం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు డి.జాన్, డి.రాజరత్నం, డి.ప్రదీప్ కుమార్, కె.సుదర్శన్, కె.ఈశ్వరావు, డి.మజ్జి, రత్నమ్మ పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - కురుపాం

ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు త్వరతగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. పిఎంజిఎవై కింద మంజూరైన సిమెంటును ఆదివారం గొటివాడ, కురుపాం పంచాయతీల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, బిల్లు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆవాస్ దేవాస్ కింద మండలానికి మంజూరైన 1041 ఇళ్లను కూడా తరితగతిగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో ఎంపిడిఒ వివి శివరామప్ప, హౌసింగ్ సిబ్బంది ఉరిడి, గుజ్జువాయి, పెద గొత్తిలి పంచాయతీల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఎస్.వెంకట్రావు, హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : ఆవాస్ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆవాస్ దినోత్సవం కుడ్డపల్లి, మండ, పెదరామ దేవనాపురం, పెద్దూరు తదితర పంచాయతీలో నిర్వహించారు. కుడ్డపల్లిలో గృహనిర్మాణశాఖ పీడీ రఘురాం, ఎంపిడిఒ కె.గీతాంజలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎంఎవై కింద కుడ్డపల్లి పంచాయతీలో 150 ఇళ్లు మంజూరయ్యావని వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. బిల్లులో సకాలంలో చెల్లిస్తామన్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 1000 పైగా ఇళు మంజూరయ్యామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి రాము, సర్పంచులు, డిఇ మోహన్‌రావు, ఎఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిమెంటు బస్తాలను అందజేస్తున్న ఎంపిపి పద్మావతి

భామిని : మండలం లోని కాట్రగాఢ -బి లో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో అవాస్ దివస్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం మాట్లాడుతూ మండలంలో పిఎంఎవై కింద 760 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 415 ఇళ్లకు రూ.5వేలుచొప్పున చెల్లించారని తెలిపారు. ప్రస్తుతం 352 ఇళ్ల నిర్మాణాలు ఆపరంభమయ్యాయి తెలిపారు. అర్హులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిఒ జి.కృష్ణారావు, హౌసింగ్ ఎఇ సిహెచ్ వెంకటేష్, లబ్ధిదారులు, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర బెండ సాగు బహుబాగు

ప్రజాశక్తి - పాలకొండ

కాశీ లాలీమా అనే ఎర్ర బెండ రకం సాగు రైతులకు ఎంతో ఆదాయం వస్తుందని, ఇది వారణాశిలోని కూరగాయల పరిశోధన స్థానం నుంచి 2019లో విడుదలైందని అభ్యుదయ రైతు ఖండపు ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది ఉదా ఎరుపు రంగు కాయలతో కలిగి ఉంటుందన్నారు. దీని పొడవు 11సెంటీమీటర్ల నుంచి 14 సెంటీమీటర్ల పొడవు ఉంటుందన్నారు. ఈ బెండ వైరస్‌ను తట్టుకొని మంచి రుచిని అందిస్తుందన్నారు. కాయలు పండేటప్పుడు ఎరుపు రంగు నుంచి అకుపచ్చగా మారుతాయన్నారు. ఆకు పచ్చ బెండతో పోలిస్తే తక్కువ జిగురు ఉంటుందన్నారు. ఎర్ర బెండలో ఆరోగ్య ప్రయోజనాలున్నయన్నారు. ఆకుపచ్చ బెండతో ఎర్ర బెండలో ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇందులో తగిన మోతాదులో ఇరాన్, యాంటీ ఆక్సిడెంట్లు ఎంతో సైన్, ఫైనాలే వంటి పోషకాలు పుష్కలంగా ఉండడం వల్ల రోగ నిరోధక శక్తి పెంచుతుందన్నారు. ఒక నివేదిక ప్రకారం కాశీ లాలీమాలో 9.4% కొవ్వు ఉంటుందని దీనివలన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుందన్నారు. దీనిలో ఎ, బి, సి విటమిన్లు ఉండడం వల్ల రక్త పోటు, మధుమేహాన్ని తగ్గిస్తుందన్నారు. కాశీ లాలీమాలో 21శాతం ఐరన్, 5శాతం పొటాష్ ఉన్నాయన్నారు. కిలో రూ.100 ఉంటుందన్నారు. ఈ విత్తనాలను వారణాశి నుంచి తెప్పించి ఆగస్ట్ నుంచి రోజూ తప్పించి రోజు 2 కిలోల దిగుబడి పొందానన్నారు. కొంతమందికి శాంపిల్‌గా ఇచ్చానన్నారు. సాగునీరుంటే ఈ రబీకి వేసి కొంతమంది అభ్యుదయ రైతులకు సరఫరా చేస్తానని ఆయన తెలిపారు.

తాడికొండలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సర్పంచ్ మండంగి జగ్గారావు కోరారు. గ్రామంలో చదువుకున్న యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అయితే మారుమూల ప్రాంతం కావడంతో ఎటువంటి సమాచారం అందుబాటు లేకుండా పోతుందన్నారు. పోటీ పరీక్షలు నిమిత్తం వార్తాపత్రికలు, జనరల్ నాలెడ్జ్ మెటీరియల్, నవలలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి, లక్ష్మీపురం, కృష్ణరాయపురం, బూర్జ పోలింగ్ కేంద్రాలను స్థానిక తహశీల్దార్ ఎంవి రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేసుకున్నవారు అభ్యంతరాలుంటే వాటిని పరిశీలిస్తామని అన్నారు. బూత్ అధికారులు అర్హత గల ప్రతి ఓటర్లను ఓటరుగా గుర్తించి నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, విఆర్వోలు, బూత్ అధికారులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమణ

గుమ్మలక్ష్మీపురం : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేయించుకోవాలని స్థానికసర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగంలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, వీఆర్వో బోడమ్మ, మహిళా పోలీస్ ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి సందర్భంగా శ్రీశయన వీధిలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.రవీంద్రకుమార్, సిందూర ఆస్పత్రి ప్రసూతి వైద్య నిపుణలు మాలతి, డాక్టర్ పావని, సత్యేంద్రవర్మ తదితరులు హాజరై రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనేక మంది వద్ధులు శిబిరం వద్దకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు కనకం వెంకటరమణ, రమేష్ సాహు, గీతా సాహు, కిల్లారి విజయ్‌కుమార్, మావూరి బసవలింగం, బాబ్జి, తదితరులు హాజరై రోగులకు సహయ సహకరాలు అందించారు. కార్యక్రమంలో బూర్జ ఎంపిపి దీప, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఉత్తరావిల్లి ప్రభాకరరావు హాజరయ్యారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పెద్దగొత్తిలి పంచాయతీలో గల గోటికుప్ప నుంచి నాగర కుంటుబాయి వరకు రూ.20 లక్షల నిధులతో మంజూరైన నూతన రహదారి నిర్మాణ పనులకు ఆదివారం ఎంపిటిసి సభ్యులు వి.కృష్ణకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గిరిజన గ్రామాలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, వైద్యం అందించడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి

సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్‌డిఎఫ్‌ఒ రాజారావు

అటవీ శాఖ కార్యాలయాన్ని సబ్ డిఎఫ్‌ఒ సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక అటవీశాఖ కార్యాలయాన్ని సబ్ డిఎఫ్ఒ పి.రాజారావు ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో గల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చి ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తుగా ప్రజలకు అప్రమత్తం చేసేలా సిబ్బంది ఉండాలని సూచించారు . ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజర్ రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.